# మావారూ- వారి ఉబలాటం

గండ్రేటి పెంటయ్య




"మా వారికో నాడు హఠాత్తుగా ఒక ఉబలాటం కలిగింది.

అది...

బెల్‌బాటమ్ పేంటు కుట్టించి వేసుకోవాలని. అదేమంత ఖరీదయినది కాదసలు. పేంటు కుట్టించుకోవడం పెద్ద కష్టమయిన పనేం కాదు. ఆయన ఇష్టపడడమే కష్టంతో కూడుకున్నది. ఏడాదికి ఎలా లేదన్నా రెండు, మూడు జతల బట్టలు కుట్టించుకుంటూనే ఉంటారు. అయితే అవన్నీ పాత ఫేషనువి. ఈ సారి ఆయన ఉబలాట పడ్డది బెల్ మోడలు కోసం. పేంటనేసరికి ఏ రకం దయినా బెల్ కుట్టినా, నేరో కుట్టినా లేక లూజు పేంటు కుట్టించుకున్నా దానికి పట్టే బట్టలో కిట్టింపేమీ ఉండదు. ఇచ్చే కుట్టుకూలీకూడా ఫేషనుతో పని లేకుండా ఏ పేంటుకీ ఒకే రేటులో ఇచ్చుకోక తప్పదు. అందుచేత వారు తీర్చుకోవలసిన ఉబలాటంలో పెద్ద అర్భాటమేమీ లేదు. ప్రతి ఏడాది కుట్టించుకుంటున్న పేంటుల్లో కొంచెం మార్పు—అంతే!

ఈ ఫేషను వచ్చి ఇప్పటికి దాదాపు పదేళ్ళు పోయినా మా వారు లూజు పేంట్లనే ఎంతో మోజుగా వాడుకుంటూ వస్తున్నారు. మారిన కాలం మా వారి తీరులో మార్పు తేలేక పోయింది. నేరో ఫేంట్ల వాడకం తొందర్లోనే తిరిగి ఫేషనుగా రానున్న సమయంలో, ఈ మధ్యనే వారిలో చిన్న చైతన్యం మొచ్చింది. ఏదో ఇన్నాళ్ళకయినా వారికి బెల్ పేంటు వేసుకుంటే బాగుంటుందన్న స్పృహ కలగటం... అదే నా అదృష్టంగా తెగ మురిసిపోయాను.

చెప్పుకోవడానికి ఆ ఉబలాటం వెనక ఎంతో ఉదంతముంది.

నా ప్రయత్నమూ ఉంది. కొత్తదనాన్ని బొత్తిగా తీసి పారేసే మా లూజా పేంట్ల మా రాజా మనసుని బెల్ కి మార్చడం అంత ఈజీగా జరగలేదు. ఎంతో కృషి చేశాన్నేను. కొన్ని సంఘటనలను ఏకరాశా రాయన. ఆ తరవాతనే బెల్ మీదికి మనసు మళ్ళింది.

ఆయన నలుగురు మగాళ్ళగానే హైస్కూలు వదిలాకే పెన్టమని షయ్యారట (నిక్కర్లను తొక్కి పెట్టి ఫుల్ పాంట్లను వేసుకో నారంభించడం). ప్రస్తుతానికి వారి వయసు నలభైలో నడక సాగిస్తున్నది. లోకంలో ఈ పాతికేళ్ళా ఒక్క దుస్తుల విషయంలోనే ఎన్నో మార్పులు వచ్చాయి. కాని లోకం ఏ పోకడకు పోయినా మా వారు మట్టుకు మొన్నటివరకు పాత చింతకాయనే పచ్చడిగా నూరుకుంటూ వచ్చారు. సంచుల్లాంటి పేంటుల్లో కాళ్ళీడ్చుకుంటూ ఏమిటో ఆ ఆనందం. పంట్లాంకి పైనుండి కిందవరకు గోనిసంచిలా ఒకే లూజు—కూర సంచుల్లాంటి పక్క జేబులు—ఇసక కంకర తల దాచుకునేందుకు వీలుగా కిందన మందంగా మడత—రాకాసి వోళ్ళంత కాజాలు—ఒక్క రేవుకే విరిగి పడే గుండీలు.

ఎప్పుడో ఉండే ఫేషన్నే ఎప్పటికీ పట్టుకు కూచున్న మా వారికి చేతు లెత్తి మొక్కాలన్నంత చిరాకు కలిగేది ఒక్కొక్క మారు. ఏం లేదు. మా పెదబావగారి సంగతే తీసుకోండి. ఆయన ఇంకో నాలుగేళ్ళలో రిటైరై కూచుంటారు. అయినప్పటికీ చక్కగా తలకు నల్ల రంగు పులుముకుని, మీసాలకి సెంటు పూసి సఫారీ డ్రెస్సులో కొత్త పెళ్ళి కొడుకులా ముస్తాబవుతారు. ఆయన వేసుకునే ఆ బెల్ పేంటూ, ఆ స్టైయిలూ అదంతా నే వర్ణించలేను. ఆయనొక్కరే కాదు, మా బావలూ అన్నయ్యలూ అంతా అంతే! కాని మా వారు! అంతా వాళ్ళ తాతగారి తీరు. ఆయనతో ఎక్కడికి కెళ్ళడానికీ మనసు పీకుతూనే ఉంటుంది నాకు.

తరం మారుతుంటే తరహా మారడం లోక సహజం. మా వారి నైజం అంత సహజంగా మారేది కాదు.

మారుతున్న రోజులతోపాటు మనమూ మారుతూ పోవాలన్న ఆలోచన ఆయన కుండి చావదు. అయినా పదేళ్ళ తరవాత ఇప్పుడైనా అటువంటి ఆలోచన రావడం—అదే పది వేలు. నిన్న ఉన్నట్టే ఈ నాడూ ఉందాం, రేపూ మార్పెద్దు అని మొండి కేసే రకం. ఆయన సిద్ధాంతాన్నే లోకమంతా సింగినాదంగా భావిస్తే ఈ ప్రపంచం ఎప్పటికి ఒక్కలాగే ఉండేది.

బెల్ ఫేషను వాడుకలో కొచ్చి చాలా రోజులే అయింది. నలుగురిలా మా వారూ ఆ ఫేషనులోనే కనిపిస్తే చూసి మురిసిపోదామని ఎన్నో మార్లు పరదా పడ్డాను. అందుకే ఒకసారి నిరాశగానే అడిగి చూశాను. దానికి వారు ఏమన్నారో ఎరుగుదురా? 'పిచ్చి! నాకు బూర కాళ్ళున్నాయనుకున్నావా?' అని. అంతేకాదు. 'ఆ రకం పేంట్లు బూరకాళ్ళను కప్పుకోవడానికి, పీడు లాడ్చడానికి చాలా అవసర' మట. అంతే మరి! ఫేషనులో ఉన్న ఆనందమేమిటో ఆయన గుర్తించగలిగితే గదా!

నాకు ఒళ్ళు మండింది.

"చూడండి, శ్రీవారూ! అందరూ ఎద బాగుం, దనుకుంటే అదే అందం. నలుగురూ మెచ్చి అనుసరించేదే నాగరకత. అంతేకాని బెల్ పేంటేసుకునే వారంతా బూరకాళ్ళ వాళ్ళు కారు. కాలిమోరీ వేలకు తాకడం మనిషి పొడగరవిపిస్తాడు తప్ప, అది పీఠి మాడ్చి పెట్టాలన్న తాపత్రయం కాదు. మీ సంచుల్లాంటి పేంటు పక్క జేబులు జేబుదొంగలకెంత అనువో మీ కంత సులభంగా ఎక్కడ తెలిసి వస్తుంది లెండి! ఎన్నిమార్లు మీ పర్సు మాయమవలేదు చెప్పండి? ఎందువల్ల? మీ లూజుపేంట్ల వల్లనే! అవే ఇప్పటి బెల్ పేంట్లలా ముందు జేబులుండి తుంటిపద్ద కాస్త టైటుగా ఉంటే జేబుపై చెయ్యి వేసేందుకు కూడా సాహసించలేరు. పైగా నడుము నుండి మోకాళ్ళ మేరకు ఒంటికి పట్టినట్టుండి, కింది లూజు వల్ల కాళ్ళకు ఫ్రీగా ఉండి తొడుక్కున్న ఆసామీకి కొంత సొగసును తెచ్చి పెడుతుంది. ఇంకా క్రాస్ పాకెట్లయితే అదొక వెరైటీగా ఉంటుంది. కిందన మడత ఉండని కారణంగా తేలికగా కూడా ఉంటుంది. మీ రేసుకున్న పేంటు మోరీ మడత విప్పి చూడం డొక మారు. ఇసకా మట్టీ ఎంతలా జమ కూడి ఉంటాయో! మీ రొక్కరూ కాదని వాదించి నన్నెదిరించినా, అందరూ హర్షిస్తున్నదీ, ఇంతవరకు బెస్టు మోడల్ గా చలామణీ అవుతున్నదీ బెల్ సిస్టమే!"

అన్న మన్నీ విని అదో మాదిరిగా నవ్వేసి పంచుల్లాంటి జేబుల్లో చేతుల్ని గించుకుని గడప దాటి పోయారు. వెళుతూ వెళుతూ వెనక్కి వెనక్కి తిరిగి "బెల్లు బెల్లంటూ నన్ను అల్లరి పెట్టకే, చిట్టీ! అదేదో కుర్రకారు గ్గాని నా కెందుకు లేవే!" అనేసి అదే పోజులో అలా వెళ్ళిపోయారు.

నా మనసు మూలిగింది. 'ముసిలిముండాస్టయిలూ మీరూను.'

కట్టుకున్న వారి నంత మాట అనడం నా వంటి దానికి తగక పోవచ్చు కాని, ఉన్న సంగతిని కడుపున దాచడం ఎటువంటి వారికీ కష్టమే కనుక నా మనసులోని మాట అనేస్తున్నాను. మా వారి దంతదుస్తపోతు వ్యవహారం. నా మన సేనాడో ఈ నిజాన్ని గ్రహించి భరించు కొచ్చింది. వారిక మారరు గాక మారరు అన్న నిరాశా కలిగింది. కాని నా అంచనా సరి అయినది కాదన్నది తరవాతనే తెలియవచ్చింది.

అనవసరంగా నేను వర్రీ అయి నిరాశ చెందానే తప్ప, కాలమన్నది ఎన్నటికయినా ఎంతటి గట్టి ఘటాన్నయినా ఖచ్చితంగా మార్చి తీరుతుందన్న సత్యానికి మావారొక చక్కని ఉదాహరణ. నన్నాశ్చర్యంలో ముంచేస్తూ తనంతట తానే ఒక రోజన్నారు—'నువ్వన్నట్టు బెల్ పేంటు ఒకసారి తొడిగి చూడాలే చిట్టీ'. అంత ఆశ్చర్యంలోనూ మా వారిలో అంత ఆకస్మికంగా మార్పు తెచ్చిన అనుభవా లేమయి ఉండి ఉంటాయోనని ఆలోచించ సాగాను.

నా వూహ ప్రకారం మొదటి కారణ మేమయి ఉండొచ్చునంటే—

ఆయ నొకమారు మా అమ్మాయికి ఇంగ్లీషు పాఠం చెబుతూ క్షణం సేపు అలా ఆలోచనలోకి ఎందు కెళ్ళారుకు పోయారో ఇప్పుడు బోధ పడింది. ఆ కథలో జంతుముఖం—పక్షి పర్సనాలిటీ ఉన్న గబ్బిలాన్ని ఇటు పక్షులూ, అటు పశువులూ ఏవీ తమ గ్రూపులో చేర్చుకోవు. అది చివరకు ఏ కోవకూ చెందక వేరుగా మిగిలి పోవడం మా వారిలో దిగులు కలిగించిందేమో! ఆ కథతో పాటు తమ ఆఫీసులోనూ స్నేహితుల్లోనూ కొందరు బెల్ పేంట్లు తొడగ్గా, కొందరు పంచెలు కడుతుంటారు. ఆ రెండు తెగలకు చెందక మా వా రొక్కరూ మరో తెగగా మిగిలి పోవడం గుర్తు కొచ్చి కలవరపడ్డారేమో! ఆ కారణంగానే మనసు కొంత మెత్తబడి ఉండవచ్చు.

రెండో కారణం ఏమయి ఉండవచ్చంటే—

పోయిన పండగకు మా కన్నవారింటినుండి పిలుపు రాగానే నాలుగు రోజులు సెలవులో వెళ్ళాం. మా అక్కయ్యా బావలు, అన్నయ్యా వదినలు అంతా వచ్చా రక్కడికి. ఇల్లంతా పెళ్ళి సందడిలా ఉండేది. పండగ సందర్భంగానూ, అదీ మేమంతా ఒకే చోట



గుమిగూడిన కారణంగానూ ఫోటో దిగమని మా అమ్మా నాన్నలు పోరు పెడితే సరే నన్నాం. ఫోటోగ్రాఫర్ని ఇంటికే పిలుచుకొచ్చాం. ఫోటోకి ముందు ఎవరికి ప్రత్యేకించిన కుర్చీలో వాళ్ళం వరసగా కూచున్నాం. కెమెరా సెట్ చేస్తూ ఫోటోగ్రాఫరు ఏమనుకున్నాడో ఏమో కాని, మా వారి నుద్దేశించి అన్నాడు:

"అయ్యా మీ రేమీ అనుకోనంటే ఒక సలహా! గ్రూపులో అంతా మోడరన్ డ్రెస్‌లో టిప్‌టాప్‌గా ఉన్నారు. మీరూ వాళ్ళతో కలిసి పోయేట్టు డ్రెస్ మార్చుకుంటే ఫోటో కొక నిండుదన మొస్తుంది. తరవాత మీ ఇష్టం."

ఇంకేముంది? మా వారి ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్క లేదు. నాకు తల కొట్టేసినంత పనయిందన్న మాట. అంతా మా దంపతుల వంక వింతగా చూశారు. ఈ సంఘటనే వారి మనసుపై సుత్తిలా పనిచేసి మరి కాస్త మెత్తబరిచి ఉండొచ్చను కుంటాను.

ఇక నిస్సందేహంగా మూడో కారణ మిదే.

మా పిన్ని కొడుకు సాంబుకి పెళ్ళి సంబంధం చూడ్డానికని మేం సాలూరు వెళ్ళాం. మాతోపాటు కర్మ కాలి వాడికోలీగ్ శంకర్రావూ వచ్చాడు. మా సాంబుగాడు చాలా సాదా సీదా కుర్రాడు షోకిల్లా కాడు. పోకిరీ వేషాల ప్రసక్తే లేదు. అచ్చా మా వారి అడుగు జాడల్లో నడిచే రకం. పెళ్ళిచూపుల టైములో సాంబుకి ఒక పక్క మా వారూ, రెండో పక్క శంకర్రావూ కూచున్నారు. అమ్మాయిని వాళ్ళ కెదురుగా చాపపై కూచోపెట్టారు. నాకూ మా వారికీ పిల్ల బాగా నచ్చింది. చదువుకుంది. చక్కగా పాడుతుందట కూడాను. మా ఇష్టమ్మాట అటుంచి ఒకటి కావలసిన వాళ్ళు ఒకరి కొకరు తెలుసుకోవాలిగా! మాసాంబుగాడుచచ్చినా నోరువిప్పడు. అందుకే అమ్మాయిని ప్రోత్సహించాను. అవకాశం కోసమే ఆమె చూస్తున్నదా అన్నట్టు అడిగింది. 'చాన్స్ వస్తే నేను సినిమాల్లో పాడాలనుకుంటున్నాను. మీ కభ్యంతరమా?' మేం ఆరెత్తి పోయి నోళ్ళు తెరుచు కూర్చుండి పోయాం. అస లామె ప్రశ్నించింది ఎవరిననుకున్నారు? ముప్పయ్యేళ్ళ వయసు ముగ్గురు పిల్లల తండ్రి అయిన శంకర్రావుని. చక్కని ముక్కూ, చెవులను కప్పిన క్రాపు, సన్నని మీసం, గాబర్డిన్ బెల్ పాంటు డిస్కో షర్టు.


ఈ సంఘటన వారిని చాలా మార్చి ఉండాలి. అర్జంటుగా బెల్‌బాటమ్స్ పేంటు వేసుకోవాలన్న ఆరాటం ఆ రోజుతోనే బాగా పెరిగిపోయింది.


కారణా లేమున్నా కానివ్వండి. మా వారు 'మారి నందుకు నాకు సరదాగా ఉంది. వారా ఉత్సాహంలో ఉండగానే కొంత బకాయి డబ్బు చేతికి రావడంకూడా మరింత ఉత్సాహాన్ని కొని తెచ్చింది. ఖర్చు లెన్నో కాచుక్కూచున్నా ఖచ్చితంగా దాన్నలా బట్టల షాపుకే తరలించి వేయాలనే నిశ్చయించుకున్నాం.

డబ్బందుకుని ఇంటికి తొందరగానే వచ్చేశారు. ఆ రోజు గురువారం. నాకు బాగా గుర్తు.

కరుణాకర్ క్లాత్ సెంటర్ నుండి ఒక జతకు రెండు బిట్లు తీసుకున్నాం. అదే దార్నమా అక్స్ టైలర్స్ వద్ద కెళ్ళాం. అక్కడ మా వారు బెల్ కుట్టమనడానికిబిడియపడుతున్నారని నేనే టైలర్తో చెప్పాను. బట్ట లిచ్చేశాం. ఇదివరలో ఇచ్చిన కొలత లున్నాయన్నారు. పదిహేను రోజులుపడుతుందన్నాడు. మరేం చేయుగలం? చాలా చక్కగా కుట్టిస్తా నన్నాడు. సంతోషమన్నాం. చెప్పిందే పది సార్లు చెప్పి ఇంటి కొచ్చేశాం. మా వారికి బెల్‌పై బాగా మనసయిందేమో, ఆ పేంటు వేసుకుని ఆఫీసు కెళ్ళినట్లు రోజు కల కాస్తూనే ఉన్నారు. పదిహేను రోజులూ ఎంతో కష్టమ్మీద గడిచాయి. ఆ సాయంత్రం ఇంట్లో అర్జంటు పనులున్నా వాటిని వాయిదా వేసుకుని అక్స్ టైలరు వద్ద కెళ్ళారు. నాలుగ్గంటల కెళ్ళి నాయన తిరిగి రాత్రి ఎనిమిదింటి గ్గాని ఇల్లు చేరలేదు. వస్తూనే బట్టల పేకెట్ని వంటింటి వేపు విసురుగా విసిరేశారు. ముఖం ముడుచుకు పోయి ఉంది. కారణ మడిగితే కస్సుమని లేచారు. పేకెట్టు విప్పి చూస్తిని కదా 'అక్స్ టైలరు' మీద అగ్గయ్యాలని పించింది. ఆయనలా దాన్ని వంటింటి వేపు విసిరి కొట్టడంలోని అర్థం 'తగలడింది' అని చెప్పడమే కామోసు. ఇంత శ్రమా వృధాగా పోయింది. మా వారి ఉత్సాహం నిలువునా నీరు కారిపోయింది.






ఆ దర్జీగాణ్ని అంతలా మొత్తుకుని బెల్ ఫేషను కుట్టమని ఇస్తే మళ్ళీ యథాప్రకారమే బాజు ఫేషనులో లూజుగా కుట్టి పడేశాడు. నేను నోరు విప్పక పోవడంతో ఆయనే అన్నారు. "ఆ షాపులో బట్ట లివ్వడం మనదే పొరపాటు. మనం ఇంత చెప్పినా బెల్ కుట్టమన్నట్లు గుర్తే లేదట. అసలు నా బట్టలంటే చాలట లూజు ఫిట్టింగు తప్ప మరో కట్టింగు కళ్ళెదుట మెదల్దట. పాతికేళ్ళనుండి ఒక్కలా కుట్టుకొస్తున్నప్పుడు, ఒక్క రోజులో ఎక్కడ మారిపోగల మండి అంటున్నాడట. తిరిగి విప్పి కుట్టాలంటే కుదరద న్నాడు."

మా వారి కళ్ళు వర్షించడానికి రెడీగా ఉన్నాయి. వారి అవస్థకు జాలేసింది. ఆ రాత్రి వారిని ఓదార్చ డంతోనే తెల్లారిపోయింది. వారం తరవాత కానీ తిరిగి మామూలు మనిషి కాలేకపోయారు. బెల్ పేంటుపై మా వారికి ఉబలాటం మరీ బలపడింది.

పది రోజుల తరవాత మరో జరకు బిట్లు కొన్నాం. పేంటుకి నైట్ గాజర్డీన్ పీస్ తీసుకున్నాం. ఈసారి రిక ఆక్స్ టైలరు అరుగు తొక్కదలుచుకో లేదు. కట్స్ టైలర్ వద్ద ఫిట్టింగు ఖచ్చితంగా ఉంటుందని విని ఆ షాపు కెళ్ళాం. కొంత లిచ్చి వీలయినంత త్వరగా కుట్టిమ్మన్నాం. వారం రోజుల్లోనే డెలివరీ ఇచ్చాడు. అక్కడే ఒక మారు తొడిగి చూసుకున్నారు. వారిని చూసి నాకు కొత్త పెళ్ళి కొడుకు గుర్తు కొచ్చాడు. అంతా బాగానే ఉంది కాని తెల్లని పేంటు తయారీలో కాస్త మాసిపోయింది. ఉతికితే కాని వేసుకోకూడ దనుకున్నాం. అనుకోవడమే తరవాయి శుభ్రంగా ఉతికి ఇస్త్రీ చేసి ఇవ్వమని మా మామూలు లాండ్రీలో ఇచ్చాం. వాళ్ళు ఉతికిచ్చే దాకా షరా మామూలే. ఎదేసుకుని ఊరంతా తిరిగి రావాలన్న ఉబలాటం. ఆ రోజు ఆఫీసు నుండొస్తూనే పరుగు లాంటి నడకతో లాండ్రీ కెళ్ళారు. అంత వరకు బాగానే ఉంది. అయిదు గంటల కని వెళ్ళిన శ్రీవారు ఏనిమిదిన్నర తరవాత చిరుసుర్లాడుకుంటూ ఇంటికి వేంచేశారు. పేకెట్టు వంటింట్లో కొచ్చి పడేంది. అది మళ్ళీ తగలడిందని బోధ పడినా, అది ఏ విధంగా తగలడిందో తోచక, విప్పి చూశాను. ఇంకే ముంది? తెల్లని లూజు పేంటు. అర్థంకాని ముఖంతో ఆయన వంక చూశాను.

"బెల్ పాంటు నాదంటు ఉండదని ఇంకెవరికో ఇచ్చేశాడట. లూజు పేంట్లు నేను తప్ప ఇంకెవరూ వేసుకోరని, ఎవరి పేంటునో నా కోసమని దాచి ఉంచాడు. వాడితో వాగి వాగి ఇంత టైమయింది. 'ఎప్పుడయినా మీ పేంటు తిరిగొస్తే మీ ఇంటికి తెచ్చిస్తాను బాబూ' అంటూ మొర పెట్టుకున్నాడు." ఈ వైనం వివరిస్తుంటే గొంతు బొంగురు పోయిం దాయనకు.

నెత్తి బాదుకోవడం తప్ప నే నేం చెప్పగలను?

వారం—రెండు—వారాలు—నెల రెండు నెలలు ఎన్నాళ్ళెదురు చూసినా లాండ్రీ నుంచి మా వారి పేంటూ మాకు దక్కలేదు.

శ్రీవారిలో దుఃఖం రాను రాను పెరిగి పోసాగింది. చెప్పుకోవడానికి సిగ్గు చేటు. ఆ దుఃఖాన్ని చూడలేక నా కళ్ళమ్మట నీళ్ళు ఉబికివచ్చాయి. వారి మనోవ్యధకు నా మనసు మెలికలు తిరిగి పోయింది. చూస్తూ చూస్తూ మరిక చూసే శక్తి లేక నా పట్టు చీరకై ఉంచిన పైకం నుంచి నూటముప్ఫయి లెక్క పెట్టి మరో మంచి పేంటు ముక్క కొనేశాను. కచ్చిన్స్ టైలర్స్ కిస్తే వారం గడు వడిగాడు. అన్నాళ్ళు మావారిని ఓదార్చగల ఓపిక నాకుండక, ఆ దగ్గర్లోనే డీలక్స్ టైలరు వద్ద ఇప్పించేశాం. మరునాటి సాయంత్రానికే కుట్టి పెడతానన్న ఆ టైలర్ మాస్టరుకి చేతులెత్తి మొక్కాం. ఆ రాత్రి మా వారికంతా కలత నిద్రే. మరునాడు ఆఫీసుకు సెలవు రోజు. రోజంతా ఇంట్లోనే కాలుగాలిన పిల్లిలా తచ్చాడుతూ గడిపారు. సాయంత్రం అవుతూనే హుషారుగా బయలుదేరారు. కుట్టి తెచ్చిన పేంటుని మళ్ళీ వంటింటి వేపెక్కడ విసిరి కొడతారోనని మనసు లోపల ఒటుగ్గానే ఉంది. ఏమవు తుందో ఏమోనని ఆయన గురించి వరండాలోనే వెయిట్ చేస్తూ కూచున్నాను. వెళ్ళిన అరగంటకే శ్రీవారు తిరిగొచ్చేశారు. విసిరి కొట్టేందుకు చేతిలో ఏమీ లేదు. బహుశా రేపు రమ్మన్నాడేమో అనుకున్నాను. ఈ కుట్టు పనివాళ్ళెవరూ ఇచ్చిన డేటుకి కట్టుబడి ఉండరు. కష్టమర్లని కాస్త ఆడిస్తే కాని వాళ్ళ తృప్తి ఉండదేమో!

ఇంటి కొచ్చిన ఆయన వరండాలోనే కూచుండి పోయారు నిట్టూర్పు విడుస్తూ.

"ఇంకా కుట్టలేదా?" ఉండబట్టలేక అడిగాను.

"ఏమో తెలీదు. కొట్టు కట్టేసి ఉంది. పక్క కొట్లో అడిగాను. ఏమయిందో వాళ్ళకే తెలీదట." నీరసంగా అన్నారు.

"పర్లేదండి. అనుకోకుండా కొట్టు కట్టవలసిన పరిస్థితేదో వచ్చి ఉండవచ్చు. రేపు తీసుకుందాం లెండి." ఓదార్పుగా అన్నాను.

టైలర్ వద్దకు మరునాడు వెళ్ళి వచ్చారు. ఆ మరునాడూ వెళ్ళి వచ్చారు. ఆ తరవాత రోజూ వెళ్ళి రావడం అలవాటు చేసుకున్నారు. ఎప్పుడెళ్ళినా ఎన్నాళ్ళెళ్ళి వచ్చినా కొట్టు మట్టుకు కట్టేసే కనపడేది. నడిచి తిరగటం వల్ల కడుపులోని నొప్పి ఖర్చు లేకుండానే కరిగిపోయింది. ఆ తరవాత ఒక రోజున చూద్దును గదా ఆ దుకాణం తెరిచే ఉంది కాని అక్కడ కుట్టు మిషన్లకు బదులు టైపు మిషన్లు టకటక లాడుతున్నాయి.

ఇన్నాళ్ళూ ఆయన గుండెలో గూడు కట్టిన దుఃఖం క్రమంగా నీరుగా మారి ఆయన నాసికం ద్వారా బయటకు ఉబికేసింది. నీరు తరిగిన కారణంగా కాబోలు వారి గుండె కరుడు గట్టి రాయిగా మారిపోయింది.

ఆ పైవారు మళ్ళీ బెల్‌బాటమ్ పేంటు కావాలని కోరలేదు. నేనూ వారిని వచ్చే బడ్జెట్ వరకు ఏ మాత్రమూ ప్రోత్సహించ దలుచుకోలేదు. *